## క్లుప్తంగా

### భవిత సెంటర్ పరిశీలన

**చల్లపల్లి:**సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోర్డినేటర్ ఆర్.కుముదిని సింగ్ స్థానిక భవిత సెంటర్‌ను బుధవారం సందర్శించారు. దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న పథకాలు, అలవెన్సులు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తయారుచేసిన చాక్‌పీస్ మేకింగ్, క్రాఫ్ట్ వస్తువులను పరిశీలించి వారిని ప్రశంసించారు. సెంటర్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎల్ఎస్ కోర్డినేటర్ రామకృష్ణ, టిసిఎస్ పవన్, ఐఈఆర్‌పిలు ఎస్.లక్ష్మి, కె.గౌరి పాల్గొన్నారు.

### ఫీవర్ సర్వే

**గూడూరు:**మండల పరిధిలోని రామానుజవత్ర్లపల్లిలో బుధవారం డోర్ టు డోర్ ఫీవర్ సర్వే నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ డిసీజెస్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా పంచాయతీ సర్పంచ్ రాజులపాటి రేణుకమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్ సిబ్బందితో గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మట్టా పావని, ఏఎన్ఎం నాగశ్రీ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### ఘనంగా రక్షాబంధన్

**నాగాయలంక:**మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం, రాజయోగ శిక్షణకేంద్రం నాగాయలంక సేవాస్థానం ఆధ్వర్యంలో బుధవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేమూరి కృష్ణకుమారి గృహ ఆవరణలో శ్రావణమాస పావన పర్వదినం పురస్కరించుకుని రక్షాబంధన ఉత్సవం జరిపారు. సంస్థ మచిలీపట్నం శాఖ నిర్వాహకురాలు బ్రహ్మకుమారి భారతి, సీనియర్ రాజయోగ టీచర్ కవిత నేతృత్వంలో తొలుత రక్షా బంధన్ విశిష్టతపై అవగాహన కలిగించారు. పలువురు బ్రహ్మకుమారీలు, మండవ చలపతిరావు, తలశిల శివాజీ, మండవ భుజంగరావు, రేమాల చంటి పాల్గొన్నారు.

### ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**కోనేరుసెంటర్:**బందరు సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ సీహెచ్ రాజా తెలిపారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నగరంలోని పశువుల యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రహదారులపై పశువులు స్వేచ్ఛగా తిరగడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రాత్రి వేళల్లో పశువులు స్పష్టంగా కనిపించకపోవడం కారణంగా మరిన్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. పశువులను రోడ్లపైకి రాకుండా చేయాల్సిన బాధ్యత యజమానులపై ఉందన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాల్‌రావు, గ్రంథాలయ మాజీచైర్మన్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

### కలుపు నివారణతో అధిక దిగుబడులు

**చల్లపల్లి:**వరినాట్లు వేసిన 35 రోజులలోపు కలుపును నిర్మూలించుకోవటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ జ్యోతిర్మయి రైతులకు సూచించారు. మండల పరిధిలోని మంగళాపురంలో రైతులు వరిసాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై కృష్ణా జిల్లా జల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జలవనరుల కేంద్రం వ్యవసాయాధికారి బి.పద్మజ, మండల వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ, వీఏఏ జి.లక్ష్మి పాల్గొన్నారు.

### దంచి కొట్టిన వర్షం

**ఘంటసాల:**మండల కేంద్రమైన ఘంటసాల పరిసర ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. దీంతో ప్రధాన రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. ఎండవేడి తట్టుకోలేక అల్లాడిపోతున్న ప్రజలకు, ఎండి పోతున్న పంటలకు అకస్మాత్తుగా కురిన భారీ వర్షం ప్రజలకు సేద తీర్చడంతో పాటు పంట పొలాలకు జీవం పోసిందని రైతులు చెప్పారు. ఘంటసాల - రామానగరం ప్రధాన రహదారిలోని పాత పోలీస్ స్టేషన్ వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘంటసాల, కొడాలి, అచ్చెంపాలెం, తదితర గ్రామాల్లో మాత్రమే భారీ వర్షం కురవగా మండల కేంద్రానికి కొద్ది దూరంలో ఉండే దేవరకోట, మల్లాయిచుట్టూరు, శ్రీకాకుళం, తెలుగురావుపాలెం తదితర గ్రామాల్లో వర్షం కురవకపోవడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 10న నాగాయలంకలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

**నాగాయలంక:**జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ విద్యా నికేతన్ డిజిటల్ స్కూలు ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. సంబంధిత నేత్ర వైద్య పరీక్షల వివరాల కోసం మొబైల్ నంబర్లు 9490636466, 7093617778 నంబర్లలో సంప్రదించి పేర్లు ముందుగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్షల్లో శుక్లాలు నిర్ధారణ అయితే ఉచితంగా చేయిస్తామని పేర్కొన్నారు.

## పాలకులకు రైతు సంక్షేమం పట్టడం లేదు

**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము**



బంటుమిల్లి కాలువ నీటి సరఫరా రీడింగ్‌ను ఏఈతో కలసి పరిశీలిస్తున్న రాము

**బంటుమిల్లి:**రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు పెడన నియోజకవర్గ పాలకులు సొంత సంపద సృష్టించుకునే పనిలో నిమగ్నమై రైతుల కష్టాలు పట్టించుకోలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రమేష్ (రాము) ఆరోపించారు. బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలోని బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులు ఎదుర్కొంటున్న సాగునీరు, యూరియా కష్టాలపై పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి బుధవారం బంటుమిల్లి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉదాశీన వైఖరికి తోడు స్థానిక ఎమ్మెల్యేకు సంపాదనపై స్వార్థం తప్ప రైతుల సంక్షేమం పట్టలేదని విమర్శించారు. 950 క్యుసెక్కులు రావాల్సిన కాలువకు కట్టలు బలహీనంగా ఉన్నాయంటూ అధికారులు 600 క్యుసెక్కులు కూడా ఇవ్వడంలేదంటే సాగునీటిపై పాలకులకు ఉన్న శ్రద్ధ అర్థం చేసుకోవాలన్నారు. కట్టలు బలహీనంగా ఉంటే పాలకులు అక్రమంగా అమ్ముకునే మట్టి లారీలతో కట్టలు బలోపేతం చేయవచ్చని ఎద్దేవా చేశారు. జగనన్న పాలనలో నియోజకవర్గంలో నీటి ఎద్దడి రాలేదన్నారు. మండు వేసవిలో కూడా కాలువకు నీరు తెచ్చి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వర్షాకాలంలో కృత్తివెన్ను మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి చెరువుల్లో నీరు లేకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. తొలుత మల్లేశ్వరం ఇరిగేషన్ బంగ్లా వద్ద కాలువ నీటి విడుదల రీడింగ్‌ను ఇరిగేషన్ ఏఈఈ రాజ్యలక్ష్మీతో కలసి పరిశీలించి ఆమెకు వినతి పత్రం అందచేశారు. ఎంపీపీలు వి.చినబాబు, కే. గరుడప్రసాదు, జెడ్పీటీసీలు ఎం. వెంకటరమణ, ఎం. రత్నకుమారి, వైఎస్ ఎంపీపీ ఒ. చిన్నారిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల అనుబంధ కమిటీల ప్రతినిధులు టి. శ్రీనివాసరావు, వి. విశ్వేశ్వరరావు, ఎం. నాగబాబు, పి. మహేష్, ఎంపీటీసీలు కమాల్‌బాషా, భగవాన్, వీరబాబు, సర్పంచ్ బి. రమేష్, బంటుమిల్లి, కృత్తివెన్ను మండల పార్టీ అధ్యక్షులు ఎం. నాగేశ్వరరావు, జే. భూపతి, పీ. బాబూరావు, కే. గంగాధర్, కే. మహంతిప్రసాదు, కే. లక్ష్మీజి, పి. విశ్వేశ్వరరావు, పి. శివ, బి. రాంబాబు, రామానాయుడు, కే. సుబ్బారావు, కే. నాగబాబు, ఆర్. అచ్చుతరావు, ఝాన్సీ, రాజబాబు, ఎస్. జనార్ధనరావు, బీ. గాంధీ, బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన మండలాల్లోని పలు గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

## నారాయణరావునగర్‌లో పోలీసుల తనిఖీ

**46 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో సీజ్**



తనిఖీలో పాల్గొన్న పోలీసులు, సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

**చల్లపల్లి:** పంచాయతీ పరిధిలోని నారాయణరావునగర్‌లో బుధవారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 46 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేశారు. సీఐ కె.ఈశ్వరరావు మాట్లాడుతూ ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు అవనిగడ్డ ఇన్‌చార్జి డీఎస్పీ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవనిగడ్డ సీఐ యువకుమార్ పర్యవేక్షణలో ఆరుగురు ఎస్ఐలు, 70 మంది సిబ్బందితో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి ఉదయం 7.30 గంటల వరకూ తనిఖీ నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి బయట నుంచి వచ్చిన అనుమానిత వ్యక్తులు ఎవరైనా ఉన్నారా... ఉంటే వారిని గుర్తించటం, అలాగే సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం (చల్లపల్లి), సత్యనారాయణ (మోపిదేవి), ప్రతాప్‌రెడ్డి (ఘంటసాల), శ్రీనివాస్ (అవనిగడ్డ), చాణిక్య (కోడూరు)లతో పాటు ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసులు, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.

**ఓగీసుపేటలో కార్డన్‌సెర్చ్**

**కోనేరుసెంటర్:**మచిలీపట్నంలోని ఓగీసుపేటలో బందరు సబ్-డివిజన్ పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. బందరు డీఎస్పీ సీహెచ్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా తెల్లవారుజామున నాలుగు గంటలకు బందరు సబ్-డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్ళతో పాటు కానిస్టేబుళ్ళు ఓగీసుపేట చేరుకున్నారు. ఇంటింటికి తిరిగి వివరాలు నమోదు చేసుకున్నారు. అనుమానిత వ్యక్తుల వివరాల కోసం ప్రయత్నించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో జల్లెడ పట్టారు. ఆ ప్రాంత వాసులతో మాట్లాడి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలతో పాటు ఇతర వాహనాలను సోదాలు చేశారు. ఎటువంటి పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలతో పాటు ఓ ఆటోను స్వాధీనం చేసుకుని ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత యజమానులను సంబంధిత కాగితాలతో స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. సీఐలు పరమేశ్వరరావు, అబ్దుల్‌నబీ, ఏసుబాబు, సబ్-డివిజన్ పరిధిలోని ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ



నాగాయలంకలో ఎరువుల షాపులను తనిఖీ చేస్తున్న అధికారులు

**నాగాయలంక:**మండలంలోని ఎరువుల దుకాణాలను బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేశారు. అవనిగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకురాలు జె.ఎస్.జయప్రద, స్థానిక ఏఓ అన్నలూరి సంజీవ కుమార్ ఈ తనిఖీ జరిపి రూ.3,90,00 విలువైన 15 టన్నుల ఎరువులకు స్టాప్ సేల్ నిబంధన అమలు చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌లు, బిల్లు పుస్తకాలు, లైసెన్స్‌లు, ఓఫారమ్‌లు తనిఖీ చేసారు. ఈపాస్ మెషిన్ నిల్వలు సక్రమంగా ఉన్నాయా లేదోనని చెక్ చేశారు. ఎమ్మార్పీ కంటే ఎరువులను అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ఎరువుల షాపు తనిఖీ**

**కోసూరువారిపాలెం(మోపిదేవి):**పురుగు మందులు, విత్తనాలు నాణ్యమైన కంపెనీ బ్రాండ్ కలిగిన సరుకులు మాత్రమే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి కె.హెప్సిబారాణి సూచించారు. మండల పరిధిలోని కోసూరువారిపాలెం, మేళ్లమర్తిలంక గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా కోసూరువారిపాలెంలో పురుగుమందుల షాపును తనిఖీ చేశారు. కంపెనీ బ్రాండ్ కానివి, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మేళ్లమర్తింక గ్రామంలో రైతులతో మాట్లాడుతూ వరిసాగులో తగిన మోతాదులోనే ఎరువులు వినియోగించుకోవాలని సూచించారు. కౌలు రైతులతో సహా రైతులంగా తమ సాగు తప్పకుండా పంట నమోదు చేయించుకోవాలని వివరించారు.

## విపత్తుల ప్రమాదాలపై అవగాహన



విపత్తులపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండర్ కిరణ్‌కుమార్

**పులిగడ్డ(అవనిగడ్డ):**మండల పరిధిలోని పులిగడ్డలో ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో విపత్తులపై అవగాహన కల్పించారు. పంచాయితీ పరిధిలోని పల్లెపాలెంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వరదలు, తుఫానులు, ఇతర విపత్తులు వచ్చినపుడు ప్రాణాలను ఎలా రక్షించుకోవాలో వివరించారు. విపత్తు సమయంలో గుండె ధైర్యంతో ఉండాలని, తమతో పాటు ఇతరులను కాపాడేందుకు ప్రయత్నించాలన్నారు. వరదల సమయంలో నీటిలో మునగకుండా ఎలా తప్పించుకోవాలో నేర్పించారు. సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, ఆర్ఐ బాలాజీ, మండలి దినేష్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు అంటే చులకనా?



**మచిలీపట్నంటౌన్:** కార్పొరేషన్‌లో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు కనీస ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై కమిషనర్ బాపిరాజును ఆ పార్టీ కార్పొరేటర్లు బుధవారం నిలదీశారు. మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మతో కలిసి ఆ పార్టీ కార్పొరేటర్లు నగరంలోని హెడ్ వాటర్ వర్క్స్‌ను పరిశీలించారు. తాగునీటి నిల్వలు, నీటిశుద్ధి, సరఫరా వంటి విషయాలపై కమిషనర్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ తమ డివిజన్లలో శుభకార్యాలకు ట్యాంకర్లు అవసరమైతే పంపాలని కోరినా పంపడం లేదని తెలిపారు. కూటమి ఇన్‌చార్జిలు చెబితే మాత్రం ట్యాంకర్లు పంపిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ఇన్‌చార్జులు ట్యాంకర్ల నీటిని తాగేందుకు కాకుండా గృహ, కార్యాలయ నిర్మాణాలకు వినియోగిస్తున్నా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, గూడవల్లి నాగరాజు, తిరుమలశెట్టి వరప్రసాద్, పర్ణం సతీష్, జోగి చిరంజీవి, మాజీ కౌన్సిలర్‌లు చిటికెన నాగేశ్వరరావు, శీలం బాబ్జీ పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

**చల్లపల్లి:**నున్న-గుడివాడ 220 కేవీ విద్యుత్ లైనుకు ఈ నెల 25వ తేదీ వరకూ సాంకేతిక మరమ్మతుల నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడవచ్చని ఉయ్యూరు డీఈ డి.కృష్ణనాయక్ బుధవారం తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనులు జరుగుతాయని పేర్కొన్నారు. దీనివల్ల గుడివాడలోని 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలోని ఒక సర్క్యూట్‌లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. తప్పనిసరి అయితే గుడివాడ, పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోట ఉప కేంద్రాల పరిధిలో అంతరాయం కలగవచ్చని చెప్పారు.

### ఎమ్మెల్సీ రమేష్‌పై దాడి హేయమైన చర్య

**నాగాయలంక:** వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్ యాదవ్‌పై జరిగిన దాడిన ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు బుధవారం తీవ్రంగా ఖండించారు. నాగాయలంకలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో ఓటమి భయంతోనే ఆయనపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గపు దాడులు, ఎత్తగడలను కూటమి పాలకులు మానుకోక పోతే బీసీల సత్తా ఏమిటో కూటమి ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు.

**అవనిగడ్డ:**వైఎస్సార్ సీపీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై టీడీపీ గూండాలు దాడిచేయడం హేయమైన చర్యని ఆ పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కోలా హరికృష్ణ తెలిపారు. రమేష్‌యాదవ్ కారు అద్దాలను ధ్వంసం చేసి ఆయనతో పాటు మరికొంత మంది నాయకులపై టీడీపీ గూండాలు దాడిచేయడం దుర్మార్గమన్నారు.

### మండలంలో పీఏసీఎస్ చైర్మన్‌లు, సభ్యులు ఖరారు

**నాగాయలంక:**మండలంలోని ఆరు సొసైటీలకు చైర్మన్, డైరక్టర్ల పదవులను భర్తీ చేస్తూ జిల్లా సహకార సంస్థ ఉన్నతాధికారులు సంబంధిత జాబితాలను ఆయా సొసైటీలకు బుధవారం పంపించారు.జాబితాలలో ఎవరైనా డిఫాల్టర్స్ ఉంటే వెరిఫికేషన్ చేసి పూర్తి సమాచారం ఇవ్వాలని సొసైటీలను అధికారులు కోరారు. నాగాయలంక పీఏసీఎస్‌కు చైర్మన్‌గా ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, సభ్యులుగా తాడేపల్లి వెంకట పాపారావు, బండ్రెడ్డి బాలకృష్ణ ఖరారయ్యారు. అలాగే ఏటిమొగ సొసైటీకి ఒడుగు నాగరాజు (చైర్మన్), అనిమిశెట్టి వెంకటేశ్వరరావు, విశ్వనాథపల్లి సాంబశివరావు ఎంపియ్యారు. ఎదురుమొండి సొసైటికి కొక్కిలిగడ్డ నాగరాజు, పోలాబత్తిన నాంచారయ్య, కొక్కిలిగడ్డ కోటేశ్వరరావు బర్రంకుల పీఏసీఎస్ చైర్మన్‌గా తోట శ్రీనివాసరావు, సభ్యులు కొప్పనాతి వెంకటేశ్వరరావు, తోట లక్ష్మణరావు పర్రచివర భోగాది నరసింహారావు, భోగాది రమాదేవి, డి.గోపేశ్వరమ్మ పెదకమ్మవారిపాలెం సొసైటీ చైర్మన్‌గా సబ్బినేని వెంకటేశ్వరరావు(అబ్బాయి), కొక్కిలిగడ్డ చినబాబు, విశ్వనాథపల్లి నరసింహారావులతో జాబితాలు ఖరారయ్యాయి. వెరిఫికేషన్ తదుపరి గురువారం అధికారికంగా ప్రకటించనున్నారు.

### వైభవంగా అభిషేకాలు

**బంటుమిల్లి:** పద్మావతి, గోదా సేమత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి ప్రధానమూర్తికి విశేష అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. పండితులు ముక్తేవి సత్యన్నారాయణాచార్యులు శిష్య బృందం స్వామివారి ప్రధానమూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించారు. రాజ, యుపిఆర్ విఠల్, రాధాకృష్ణ, కరుణ కుమార్, బాబు, కే. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### బాధితులకు సింహాద్రి పరామర్శ

**అవనిగడ్డ:**వ్యవసాయకూలీ పనులకు వెళ్లి ఆటోఫల్టీ కొట్టడంతో గాయపడిన మండల పరిధిలోని కొత్తపేట ఎస్సీ కాలనీకి చెందిన క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పరామర్శించారు. కొత్తపేటకు చెందిన కొంతమంది కూలీలు మోపిదేవి మండలం ఉత్తర చిరువోలులంకకు వరినాట్లు వేసేందుకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా మేళ్ళమర్తిలంక వద్ద కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి ఆటో పడిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలవ్వగా అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. వైద్యసేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

## రైతుల సమస్యలపై పోరాటానికి సిద్ధం



ఎండిపోయిన నారుమడిని పరిశీలిస్తున్న రమేష్‌బాబు, నేతలు

**మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు**

**కోడూరు:**రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్ సీపీ ఉద్యమబాట పట్టడానికి సిద్ధంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్‌బాబు స్పష్టం చేశారు. మండలంలోని ఉల్లిపాలెం గ్రామంలో సాగునీరు అందక ఎండిపోతున్న వరినారుమళ్లను బుధవారం రైతులతో కలిసి పరిశీలించారు. కాలువలకు నీటిని విడుదల చేసి రెండు నెలలు గడిస్తున్నా కూడా దిగువ కాలువలకు చుక్క నీటిని కూడా అందించలేని పరిస్థితి కూటమి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. దివిసీమలోని తీరప్రాంత మండలాలైన కోడూరు, నాగాయలంక రైతులు సాగునీరు లేక పొలాలను బీడుగా వదిలేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని చెప్పారు. గతంలో ఎన్నడూ చూడని నీటి సంక్షోభాన్ని నేడు దివిసీమ రైతులు చూస్తున్నారని పేర్కొన్నారు. కనీసం నారుమళ్లు బతికించుకొనేందుకు కూడా నీటిని ఇవ్వలేని పరిస్థితిలో పాలకులు, అధికారులు ఉండడం సిగ్గుచేటని విమర్శించారు. సాలెంపాలెం, విశ్వనాథపల్లి, పిట్టల్లంక, వేణుగోపాలపురం, ఉల్లిపాలెం, హంసలదీవి, రామకృష్ణాపురం, ఇరాలి, ఊటగుండం, మందపాకల గ్రామాల కాలువల పరిధిలోని రైతులు నారుమళ్లను కాపాడుకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. రైతుల సమస్యలు పట్టకుండా స్థానిక ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సభలు, సమావేశాలతో కాలం వెళ్లదీయడంపై ఆసహనం వ్యక్తం చేశారు. నారుమళ్లకే నీటిని ఇవ్వలేని ప్రభుత్వం, పంట పండించేందుకు నీటిని ఎలా అందిస్తారో చెప్పాలని ప్రశ్నించారు.

**క్రాప్‌హాలిడే ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నాం..**

ప్రభుత్వం స్పందించి సాగునీటిని ఇవ్వకపోతే క్రాప్ హాలిడే ప్రకటిస్తామని ఉల్లిపాలెం రైతులు రమేష్‌బాబుకు తెలిపారు. పోసిన నారుమళ్లను బతికించేందుకు ట్యాంకర్లతో తడపాల్సిన పరిస్థితి వచ్చిందని, నాట్లు వేసిన తరువాత సాగునీరు ఇవ్వకపోతే అప్పులు పాలవుతామని రైతులు వాపోయారు. ఇప్పటి వరకు చుక్క నీరు కూడా రాని వెయ్యి ఎకరాలకు సంబంధించి క్రాప్‌హాలిడే ప్రకటిస్తామని రైతులు స్పష్టం చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ వెన్నా ప్రసాద్, జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, సోషల్ మీడియా కన్వీనర్ పోతన నాగరాజు, గ్రామనేతలు కటకం కుటుంబరావు, కమ్మిలి కోటేశ్వరరావు, వెర్రీ శ్రీనివాసరావు, సనకా రాము, దారపురెడ్డి జగదీష్, మెండు అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల ద్వారానే బిడ్డకు ఆరోగ్యం



చినకళ్లేపల్లిలో గర్భిణులు, బాలింతలకు టీహెచ్ఆర్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ రామారావు

**చినకళ్లేపల్లి(ఘంటసాల):**చిన్నారులకు తల్లిపాలు పట్టించడం ద్వారా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ శ్రీకాకుళం సెక్టార్ సూపర్ వైజర్ రాజరాజేశ్వరి అన్నారు. ఘంటసాల మండలం చినకళ్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సర్పంచ్ గుత్తికొండ రామారావు, ఎఎన్ఎం బి.కుసుమ కుమారి, జీఎంఎస్‌కే భాగ్యలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్.సునీత, సీహెచ్.జీవమణి, ఆశా వర్కర్లు కె.ఝాన్సీ రాణి, కె.దేవేంద్ర, తల్లులు పాల్గొన్నారు.

**కృత్తివెన్ను:**పుట్టిన బిడ్డకు తల్లిపాలను మించిన పౌష్టికాహారం మరోటి లేదని ఆరోగ్యాధికారులన్నారు. బుధవారం మండలంలోని పీతలావ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ ప్రతి తల్లీ కూడా బిడ్డకు ఆరు మాసాల వరకు తల్లిపాలను మాత్రమే ఆహారంగా అందించాలన్నారు.

**గూడూరు:**మండల పరిధిలోని పోసినవారిపాలెంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శోభన, ఏఎన్ఎం నాగలక్ష్మిలు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఆశా కార్యకర్తలు సాయి కుమారి, సుబ్బలక్ష్మి, బసవేశ్వరమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**చల్లపల్లి:**అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించటం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతోపాటు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విశ్రాంతమ్మ తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నిర్వహించారు. మేకావారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ విశ్రాంతమ్మ పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

## సంక్షిప్త వార్తలు

- **ఒకేషనల్ కోర్సులతో ఎంతో మేలు**

**మచిలీపట్నంటౌన్:** నేటి విద్యార్థులు ఒకేషనల్ కోర్సులు చదివితే ఉపాధి త్వరగా లభించి జీవితానికి ఎంతో మేలు జరుగుతుందని ఒకేషనల్ ఎడ్యుకేషన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసి) ఆర్ కుమిదినీసింగ్ అన్నారు. నగరంలోని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్యూటీ అండ్ వెల్‌నెస్ ట్రేడ్‌కు సంబంధించిన ల్యాబ్‌ను ఆమె పరిశీలించారు. పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు కొడాలి శ్రీరమ ను ఆమె అభినందించారు. ఈ పర్యటనలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జి సి డి ఓ) సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

- **బందలాయిచెరువులో నేత్రదానం**

**బందలాయిచెరువు(అవనిగడ్డ):** గ్రామానికి చెందిన తుంగల కృష్ణ తులసమ్మ(86) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. వృద్ధాప్యం వల్ల కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురైన ఆమె బుధవారం మరణించారు. ఆమె కుమారులు తుంగల దశరథ రాంబాబు, పూర్ణచంద్రరావు, తాండవకృష్ణ తన తల్లి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రావడంతో సుదర్శిసేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ ద్వారా విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ హాస్పటల్ డాక్టర్ మహేష్ నేత్రాల నుంచి కార్నియాను సేకరించారు. గతంలో ఈమె భర్త వెంకటేశ్వరరావు మరణించినపుడు కూడా కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు. తమ సంస్థ ద్వారా 240వ నేత్రదానమని రఘుశేఖర్ చెప్పారు.

- **నేడు ఎంఎస్ఎంఈపై అవగాహన సదస్సు**

**పెడన:**మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం హాలులో గురువారం ఎంఎస్ఎంఈపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కటకం శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పెడన పరిసర వర్తకులు, కలంకారి పరిశ్రమ వర్గాలు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- **సింథటిక్ మ్యాట్‌లు పంపిణీ**

**చల్లపల్లి:**మండల పరిధిలోని తీరప్రాంతమైన ఆముదార్లంక గ్రామంలో విజయవాడకు చెందిన జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అసిస్టెంట్ కమాండర్ ఎ.కిరణ్‌కుమార్ 392 కుటుంబాలకు సింథటిక్ మ్యాట్‌లను బుధవారం పంపిణీ చేశారు. కృష్ణానది పరివాహక తీరప్రాంతాల్లో ఉండే గ్రామాలకు ఈ మ్యాట్‌లను పంపిణీ చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆముదార్లంక ఎన్‌డిఆర్ఎఫ్, ఆర్ఐ జి.కృష్ణమోహన్, పంచాయతీ సెక్రటరీ ఎంఎన్‌వి తిరుమలేష్ పాల్గొన్నారు.

- **ఆర్‌టీఐ చట్టంపై అవగాహన ర్యాలీ**

**అవనిగడ్డ:**వ్యవసాయశాఖ, ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌డ్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎఫ్ఏ జిల్లా హెచ్ఆర్ కృష్ణార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు అవనిగడ్డ వంతెన సెంటర్ నుంచి ర్యాలీ చేశారు.

### ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

**పెడన:**మండల పరిధిలో ఉన్న వ్యవసాయ రైతులు తమ పంటలను ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని పెడన ఏవో సజ్జా జెన్నీ అన్నారు. బుధవారం ఆమె మండలంలోని చెన్నూరు, చేవేంద్ర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. రైతులు వరి సాగులో ఏ రకం విత్తనం వేసింది, ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తుంది, ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు, అడంగళ్ కాపీతో సంబంధిత వీఏఏలను సంప్రదించి ఈ పంటలో రైతులు పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. చేవేంద్ర గ్రామంలోని ఉమా ఫెర్టిలైజర్స్ ఎరువుల దుకాణాన్ని ఏవో జెన్నీ పరిశీలించారు.

### ఎస్టీవోకి వినతి పత్రం అందజేత

**అవనిగడ్డ:**పెన్షనర్స్ వివరాలు తగు ప్రొఫార్మాలో రూపొందించేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌టీవో అనీష్ అహ్మద్‌కు గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎస్‌టీవోకి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం రామకృష్ణ, కార్యదర్శి అబ్దుల్ అజీజ్‌తో పాటు పలువురు అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.